సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



అదరగొట్టిన కడప బాలికలు

మైదుకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–17 బాలుర, బాలికల వాలీబాల్ పోటీల్లో కడప, విజయనగరం జట్లు అదరగొట్టాయి.

-8లో



ఇస్రో శిక్షణతో ఉపయోగం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అందించే శిక్షణ పీజీ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వైవీయూ వైస్ చాన్సలర్ చింతా సుధాకర్ పేర్కొన్నారు.

-8లో

గరిష్టం/కనిష్టం
37.0/25.9

వాతావరణం

జిల్లాలో సోమవారం 25.9 – 37.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వైభవం..పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న వీరభద్రస్వామి

రాయచోటిటౌన్: రాయచోటి శ్రీభద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి పల్లకీ ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. ఉత్సవ మూర్తులను పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు.పల్లకిలో కొలువుదీర్చారు ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలం రెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు పాల్గొన్నారు. అర్చకులు వీరికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

15న సత్యాగ్నికి 'కేతు' పురస్కారం



షేక్ హుసేన్ సత్యాగ్ని

కడప కల్చరల్: ప్రముఖ సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి పేరిట అవార్డును ఈనెల 15వ తేదీన బ్రౌన్ గ్రంథాలయంలో సాహితీవేత్త షేక్ హుసేన్ సత్యాగ్నికి అందజేయనున్నట్లు కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు అలపర్తి పిచ్చయ్య చౌదరి, బోయపాటి దుర్గాకుమారిలు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. పురస్కార గ్రహీత సత్యాగ్ని, ప్రముఖ రచయితలు పాలగిరి విశ్వప్రసాద్, డాక్టర్ వేంపల్లె షరీఫ్, ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి, ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డిలు ఆచార్య కేతు, సత్యాగ్ని జీవితం–సాహిత్యంపై ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో పేరుగాంచిన వారికి ఆత్మీయ సత్కారాలు చేయనున్నట్లు తెలిపారు.

బాధితులకు న్యాయం చేయాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

కడప అర్బన్: జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్‌డూడీ, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రార్థనకు వెళుతూ.. పైలోకాలకు..

- రోడ్డుప్రమాదంలో నలుగురు దుర్మరణం
- 10 మందికి తీవ్రగాయాలు
- మృతులు కడప, ప్రొద్దుటూరు చెందిన వారు



ప్రొద్దుటూరు ఆసుపత్రిలో మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు



షాకీర్ మృతదేహం ఇన్‌సెట్ ఫైల్‌ఫొటో



అమీనా మృతదేహం ఇన్‌సెట్ ఫైల్‌ఫొటో



మృతి చెందిన హసీనా ఇన్‌సెట్ ఫైల్ ఫొటో



మహబూబ్‌బాషా మృతదేహం ఇన్‌సెట్ ఫైల్ ఫొటో

ఎర్రగుంట్ల/ప్రొద్దుటూరు: మదినిండా భక్తితో..తాము నమ్ముకున్న దైవానికి కోరికలు విన్నవించి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ ప్రార్థనకు బయలుదేరిన వారిని రోడ్డుప్రమాద రూపంలో మృత్యువు వెంటాడటంతో మరలిరాని లోకాలకు వెళ్లారు. దయనీయమైన ఈ సంఘటన సోమవారం ఎర్రగుంట్ల మండలంలో జరిగింది. ఆటోను బస్సు ఢీకొనడంతో నలుగురు దుర్మరణం చెందగా..10 మంది తీవ్రంగా గాయపడ్డారు.

పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని ఆజాద్ నగర్ కాలనీకి చెందిన మైనార్టీలు పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కడపలో నివాసం ఉండే మహచాన్, మాహబూబ్‌బాషా, హసీన, నఫీసా, బీబీజాన్‌లు కుటుంబీలకుతో కలసి తొండూరు మండలంలోని మల్లేల గ్రామంలో ఉన్న మసీద్‌కు వెళ్లడానికి ఆటోలో కడప నుంచి బయలు దేరారు. వీరు ప్రొద్దుటూరులోని పెన్నానగనర్, సుబ్బిరెడ్డినగర్‌కాలనీలలో ఉన్న వారి బంధువులను కూడా పిలుచుకెళ్లడానికి మైదుకూరు మీదుగా ప్రొద్దుటూరుకు వచ్చారు. ప్రొద్దుటూరులోని ఎస్ కమాల్‌బాషా, జాఖీర్, అమీనా, షేఫ్వీన్‌లను ఎక్కించుకున్నారు.మల్లేల మసీద్ వద్ద ప్రార్థనలు చేసుకోవడానికి ఆటోలనే అన్నం, కూరలు, తినుబండరాలను తీసుకుని బయలు దేరారు. వీరిని మృత్యువు వెంటాడింది. ఎర్రగుంట్ల పట్టణంలోని ప్రొద్దుటూరు మార్గంలో ఉన్న ఎస్వీ కల్యాణ మండపం వద్దకు రాగానే ముందు వెళతున్న లారీనీ క్రాస్ చేస్తుండుగా పులివెందుల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో సయ్యద్ మహబూబ్ బాషా (30), సయ్యద్ హసీనా (26), అమీనా (28), షేక్ షాకీర్‌బాషా (13)లు అక్కడిక్కడే మృతి చెందారు. మిగిలిన వారిలో ఎస్ అయిషా(4), ఎస్ ఆసిఫా (6), షేక్ కమాల్‌బాషా (15), షేక్ జాబీస్(15), షేక్ నఫీసా(38), షేక్ నస్రీన్ (13), షేక్ మహచాన్ (50), షేక్ జాకీర్ (12), సయ్యద్ బీబీజాన్ (67), షేక్ షేఫ్వీన్ (35)లు తీవ్రంగా గాయపడ్డారు.. ఈ దుర్ఘటనతో రహదారి అంతా రక్తసిక్తమైంది. ఆటో నుజ్జునుజ్జు అయింది. ప్రమాదం జరిగిన వెంటనే ఆ మార్గంలో వెళుతున్న స్థానికులు గాయపడిన వారిని ప్రత్యేక ప్రైవేట్ వాహనాల్లో చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. ఎర్రగుంట్ల పట్టణ సీఐ ఈశ్వరయ్య , ఎస్ఐ ప్రవీణకుమార్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎర్రగుంట్ల తహసీల్దార్ నాగేశ్వరరావు విషయాన్ని జిల్లా కలెక్టర్ విజయరామరాజుకు తెలియజేశారు.

దర్గాకు వెళ్లాలని అక్క ఇంటికి వచ్చారు..

ప్రొద్దుటూరులోని పెన్నానగర్‌కు చెందిన షేక్ మహబూబ్‌బాషా కూరగాయాల మార్కెట్‌లో గుమాస్తాగా పని చేస్తున్నాడు. అతనికి భార్య షఫివున్,షాకీర్, జాకీర్, కమాల్‌బాషా అనే ముగ్గురు కుమారులున్నారు. అతని బావమరిది సయ్యద్ మహబూబ్‌బాషా కడపలోని ఆజాద్‌నగర్‌లో ఉంటున్నాడు, అతను కుటుంబ సభ్యులతో కలిసి మల్లేల ఇమాంబి దర్గాకు వెళ్లేందుకు ఆదివారం ప్రొద్దుటూరుకు వచ్చాడు. అందరూ కలసి అక్క ఇంట్లో సరదాగా గడిపారు. సోమవారం ఉదయం మల్లేల ఇమాంబి దర్గాకు వెళ్లాలని చర్చించుకున్నారు. ఈ మేరకు రాత్రి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రొద్దుటూరులోనే ఒక ఆటోను బాడుగకు మాట్లాడుకొని అందులో వెళ్తుండగా ఎర్రగుంట్ల సమీపంలోకి వెళ్లగానే ఆటో ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో కడపకు చెందిన సయ్యద్ మహబూబ్‌బాషా, అతని భార్య హసీనా, ప్రొద్దుటూరులోని షేక్ మహబూబ్‌బాషా కుమారుడు షాకీర్‌బాషా, ఈశ్వరరెడ్డినగర్‌కు చెందిన అమీనా మృతి చెందారు. అమీనా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదించసాగారు.

- రోడ్డు ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి సోమవారం జిల్లా ఆస్పత్రికి వచ్చి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. విజయవాడలో ఉన్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

ఆర్టీసీ, టిప్పర్ డ్రైవర్లపై కేసు నమోదు

రోడ్డు ప్రమాద ఘటనపై విచారణ జరిపి ఆర్టీసీ డ్రైవర్, టిప్పర్ డ్రైవర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య సోమవారం తెలిపారు.

కుమారుడు మృతి..భార్య, మరో ఇద్దరు కొడుకులకు గాయాలు

మహబూబ్‌బాషా కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదంలో కుమారుడు షాకీర్‌బాషా మృతి చెందగా భార్య షఫివున్, మరో ఇద్దరు కుమారులు జాకీర్, కమాల్‌బాషాలకు గాయాలయ్యాయి. వీరిలో షఫివున్ తీవ్రంగా గాయపడ్డారు. షాకీర్‌బాషా మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు.. గాయపడిన షఫీవున్, ఇద్దరు పిల్లలను తలుచుకుంటూ వారికి ఏమౌతుందోనని రోదించసాగారు.



విలపిస్తున్న షాకీర్ తండ్రి మహబూబ్‌బాషా

అజాద్‌నగర్‌లో విషాదం

కడప అర్బన్/చింతకొమ్మదిన్నె: కడపలోని ఆజాద్‌నగర్‌కు చెందిన మహబూబ్‌బాషా ఐటీఐ సర్కిల్ సమీపంలో కార్పెంటర్‌గా విధులు నిర్వహించేవాడు. అతనితో పాటు భార్య హసీనా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.ప్రమాదంలో మరణించి శవాలుగా మారి ఇంటికి రావడాన్ని ఆ ప్రాంతంలోని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. ఒకే కుటుంబంలోని భార్యాభర్తలు ఇద్దరు మృత్యువాత పడటం, వారి బంధువులు క్షతగాత్రులుగా మారి ఆసుపత్రుల్లో చికిత్స పొందటంతో ఆజాద్‌నగర్‌లో విషాదం నెలకొంది. భార్యాభర్తల మృతదేహాలకు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కడపలోని ఇందిరానగర్‌కు చెందిన హసీనాను రెండేళ్ల క్రితమే మహబూబ్‌బాషాకు ఇచ్చి వివాహం చేశారు. వారు చాలా అన్యోన్యంగా ఉండేవారనీ, ఇలా మృత్యువాత పడటంతో ప్రతిఒక్కరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : సోమవారం 'స్పందన'కార్యక్రమంతో పాటు ప్రతి బుధ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం'అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ జయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే స్పందించేలా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్ కుమార్, ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, డ్వామా, ఐసిడిఎస్ పీడీలు యదుభూషణ్‌రెడ్డి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ విజయరామరాజు

ఆరోగ్య సురక్ష విజయవంతం చేయాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించారు. ఇంటింటి సర్వేలో నాణ్యత ఉండాలన్నారు. క్యాంపుల్లో బ్యాగులు, ఫోల్డర్లు, ట్యాబెట్లు, మెడికల్ కిట్లు, డాక్టర్లు అంతా అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఓపీ డేటా ఎంట్రీ ప్రకారం ఆన్‌లైన్ డేటా ఎంట్రీ సరి చూసుకోవాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 11–12 తరగతులకు సంబంధించిన గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ప్రగతిని సమీక్షించారు. ప్రాధాన్యత భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల వారీగా ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. రక్తహీనత ఉన్న 11–19 ఏళ్ల బాలికలను గుర్తించి ఐరన్ ట్యాబెట్లను పంపిణీ చేయాలన్నారు కార్యక్రమంలో జేసీ గణేష్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల/రూరల్: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. పులివెందుల మండల పరిధిలోని అచ్చవెల్లి గ్రామ సమీపంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో పాడా ఓఎస్డీఅనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పులివెందుల మండలం మండలంలోని తుమ్మలపల్లె, రాగిమానుపల్లె, కనంపల్లె, మోట్నూతలపల్లె, ఎర్రబల్లె, నల్లపురెడ్డిపల్లె, నల్లగొండువారిపల్లె గ్రామాల నుంచి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పంచాయితీల వారీగా నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. అచ్చవెల్లి, ఎర్రిపల్లి పంచాయతీలోని గ్రామల ప్రజలతో ఏవైనా సమస్యలున్నాయా..అని అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వారు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. కొంతమంది యువకులు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ప్రైవేట్ పరిశ్రమల్లో సంబంధిత అధికారులతో మాట్లాడి అర్హులైన వారికి ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా చూడాలన్నారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో సచివాలయానికి సంబంధించి బోర్లు, మోటార్లు, త్రాగునీటి పైపులు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎంపీని కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని అధికారులకు సూచించారు. మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి పైపులైన్లు, విద్యుత్ స్తంభాలు వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.



ప్రజల సమస్యలను వింటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్య సేవలు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వైద్య సేవలు అందించాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన స్పందిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సేవలు అందిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్వో మాధవకృష్ణారెడ్డి, అర్‌డబ్ల్యూఎస్ ఈఈ సుధాకర్‌రెడ్డి, సీఎం ఆఫీస్ ఎమ్మార్వో రాంభూపాల్ రెడ్డి, ఆర్‌ఐలు, వైఎస్సార్సీపీ నాయకులు బలరామిరెడ్డి, అజ్జుగుట్టు భాస్కర్‌రెడ్డి, పుష్పనాథరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ ఛైర్మెన్ సర్వోత్తమరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అచ్చవెల్లి సర్పంచ్ రమేష్, వైఎస్సార్సీపీ నాయకులు రసూల్, రఫి, గంగిరెడ్డి, రమణారెడ్డి, నూరుల్లా, భూపాల్‌రెడ్డి, డిష్ వెంకటరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శనగ రైతుకు ప్రోత్సాహం

- జిల్లాకు 74,120 క్వింటాళ్ల బుడ్డశనగ విత్తనాలు మంజూరు
- సబ్సిడీ 40 శాతానికి పెంచిన ప్రభుత్వం
- ఎకరాకు పంపిణీ చేయనున్న విత్తన పరిమాణం 25 నుంచి 40 కిలోలకు పెంపు

వల్లూరు: రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది. సాగులో విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తోంది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా రబీలో వర్షాధార పంటగా విస్తృతంగా సాగు చేయనున్న బుడ్డ (పప్పు) శనగ పంట సాగుకు మరింత ప్రోత్సాహాన్ని అందించడానికి చర్యలు చేపట్టింది. రైతులకు పంపిణీ చేస్తున్న బుడ్డ శనగ విత్తనాలపై ఇస్తున్న సబ్సిడీని 25 శాతం నుంచి 40 శాతానికి పెంచింది. దీంతో బాటు విత్తనాల పరిమాణాన్ని పెంచింది.

- గతంలో ప్రభుత్వం రైతులకు వ్యవసాయశాఖ ద్వారా ఎకరాకు 25 కిలోల చొప్పున గరిష్ఠంగా 5 ఎకరాల వరకు 125 కిలోల విత్తనాలను పంపిణీ చేసేది. ఇవి పంట సాగుకు పూర్తి స్థాయిలో సరిపోక పోవడంతో రైతులు ఇబ్బందులు పడేవారు. అవసరమైన అదనపు విత్తనాలను కొనుగోలు చేయడానికి ఆర్థికంగా అవస్థలు పడాల్సి వచ్చేది. దీంతో ప్రభుత్వం అన్నదాతకు సరిపడా విత్తనాలను పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టింది. ఒక్కో రైతుకు 0. 5 ఎకరాల వరకు 20 కిలోలు, , ఒక ఎకరా వరకు 40 కిలోలు (రెండు 20 కిలోల బస్తాలు) చొప్పున గరిష్ఠంగా 5 ఎకరాల వరకు 200 కిలోల విత్తనాలను పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టింది.



సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి (ఫైల్)

సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు

గత సంవత్సరం పండించిన బుడ్డ శనగలను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి స్వల్ప కాలంలోనే వారికి నగదును జమ చేయడంతో ఈ ఏడాది సాగుకు మరింత మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ ప్రారంభం కానున్న నేపథ్యంలో రబీ పంటగా బుడ్డ శనగ పంటను సాగు చేయడానికి రైతులు సమాయత్తమవుతున్నారు. జిల్లాలోని జమ్మలమడుగు, కమలాపురం, పులివెందుల, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లో ఎక్కువ విస్తీర్ణంలోనూ, బద్వేలు, మైదుకూరు నియోజకవవర్గాల్లోని కొన్ని మండలాల్లో మోస్తరు విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేస్తారు. ఇప్పటికే పలు దఫాలు సేద్యాలు పూర్తి చేసుకున్న వారు రసాయన ఎరువులను విత్తి విత్తనం వేయడానికి వీలుగా పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో భూమిలో అధిక తేమ ఉన్న నేపథ్యంలో వర్షం తెరపినిచ్చి భూమి కొద్దిగా పొడిబారగానే విత్తనం వేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

రాయితీపై విత్తనాలు సరఫరా

జిల్లాలో బుడ్డ శనగ పంట సాధారణ సాగు 96,813 హెక్టార్లు కాగా పంటను సాగు చేయనున్న 21 మండలాల్లో ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా 40 శాతం రాయితీతో విత్తన పంపిణీకి ఏర్పాట్లు చేసింది. జిల్లా మొత్తానికి 74,120 క్వింటాళ్ల జేజీ – 11 రకం విత్తనాలను కేటాయించింది. విత్తనాలు అవసరమైన రైతుల నమోదు ప్రక్రియ ఇప్పటికే ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ప్రారంభమైంది. నమోదు చేసుకున్న వారికి విత్తనాల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. క్వింటా ధర రూ 8, 100 కాగా రాయితీ రూ 3, 240 పోను రైతు వాటాగా రూ 4, 860 చెల్లించి విత్తనాలు పొందాల్సి ఉంటుంది.

ప్రతినిధుల సభలో జిల్లా నేతలు





విజయవాడలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, ఎమ్మెల్యేలు శెట్టిపల్లె రఘురామిరెడ్డి,పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం తదితరులు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కడప మేయర్ సురేష్‌బాబు మాట్లాడారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో..


రంగయ్య మృతదేహం

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామంలో సోమవారం విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... వెల్లటూరు గ్రామంలో గంగాధర అను వ్యక్తికి అలంఖాన్‌పల్లె గ్రామానికి చెందిన రంగయ్య(22) ఇంటి నిర్మాణ పనులు చేయడానికి వచ్చాడు. పనులు చేస్తుండగా ఇంటికి దగ్గరలో ఉన్న విద్యుత్ తీగ తగలడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కలసపాడు : మండలంలోని దూలంవారిపల్లెలో సోమవారం 21 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగమురళి తెలిపారు. దూలంవారిపల్లెకు చెందిన పంజగాల వీరమ్మ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా దాడులు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆమె వద్ద నుంచి 21 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితురాలిని అరెస్టు చేసినట్లు వివరించారు. దాడుల్లో కానిస్టేబుల్ నారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని టోకరా

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు గ్రామానికి చెందిన చీమల సూర్యనారాయణ రెడ్డి అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఒక యువతికి రూ.5 లక్షలు టోకరా పెట్టిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లాలోని నకరికల్లు మండలానికి చెందిన రుసుం బిందు మాధవి అనే యువతి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. తన తమ్ముడికి ఉద్యోగం కోసమని తనతోపాటు పని చేస్తున్న సూర్యనారాయణరెడ్డికి రూ.5 లక్షలు ఇచ్చింది. ఆయన ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బు తిరిగి ఇవ్వలేదు. దీంతో బాధితురాలు సోమవారం చీపాడులో సూర్యనారాయణ ఇంటి ఎదుట కూర్చొని నిరసన వ్యక్తం చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువురిని స్టేషన్‌కు తరలించారు.

ఉపాధ్యాయుడు ఉరేసుకుని ఆత్మహత్య


దొంతు శ్రీధర్ మృతదేహం

కడప అర్బన్ : కడప చిన్నచౌక్ పరిధిలో నివసిస్తున్న ఉపాధ్యాయుడు దొంతు శ్రీధర్ (51) సోమవారం తమ ఇంటిలో ఎవరూ లేని సమయంలో బెడ్ రూంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన ఖాజీపేట మండలం పత్తూరులో ఉపాధ్యాయుడిగా పని చేసే వాడు. అతనికి భార్య నవ్యరాణి, ఇద్దరు పిల్లలు వున్నారు. పని ఒత్తిడి వల్లనే ఈ చర్యకు పాల్పడ్డాడని అతని భార్య ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నచౌక్ సీఐ పి.నరసింహారెడ్డి తెలియజేశారు.

అదరగొట్టిన కడప బాలికలు

- ముగిసిన అండర్–17 వాలీబాల్ పోటీలు
- విజేతలుగా కడప, విజయనగరం జట్లు

మైదుకూరు : మైదుకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–17 బాలుర, బాలికల వాలీబాల్ పోటీల్లో కడప, విజయనగరం జట్లు అదరగొట్టాయి. మైదుకూరు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరిగిన ఈ పోటీలు సోమవారం ఫైనల్ మ్యాచ్‌లతో ఘనంగా ముగిశాయి. స్థానిక మేధా డిఫెన్స్ అకాడమి మైదానంలో ఒకటో కోర్టులో సోమవారం బాలుర విభాగంలో విజయనగరం – పశ్చిమగోదావరి జిల్లాల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగగా విజయనగరం విజేతగా నిలిచింది. రెండో కోర్టులో బాలికల విభాగంలో కడప– గుంటూరు జిల్లాల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కడప జట్టు ఘన విజయం సాధించింది. బాలుర విభాగంలో సెమీ ఫైనల్‌లో విజయనగరం జట్టు చేతిలో ఓడిపోయిన శ్రీకాకుళం, బాలికల విభాగంలో సెమీ ఫైనల్‌లో గుంటూరు జట్టుతో ఓడిపోయిన ప్రకాశం మూడో స్థానంలో సరిపెట్టుకున్నాయి.

క్రీడా స్ఫూర్తితో పోటీలు జరగడం హర్షణీయం

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు మైదుకూరులో క్రీడా స్ఫూర్తితో జరగడం హర్షణీయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి తెలిపారు. వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు సమావేశంలో ఆయన అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలు మైదుకూరులో నిర్వహించడం నియోజకవర్గానికి ప్రతిష్టగా నిలిచిందన్నారు. టోర్నమెంట్ ప్రారంభ వేడుకల్లో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆయన తనయుడు నాగిరెడ్డి సోమవారం పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు నగదు బహుమతులను అందజేశారు. బాలికల, బాలుర విభాగంలో విజేతలుగా నిలిచిన కడప, విజయనగరం జట్లకు రూ.20 వేల చొప్పున, రెండో స్థానంలో నిలిచిన పశ్చిమగోదావరి, గుంటూరు జట్లకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను ఆయా జట్ల కెప్టెన్, కోచ్ మేనేజర్లకు అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల జట్లకు రూ.5 వేల నగదును అందించారు. మైదుకూరు మున్సిపల్ వై.రంగస్వామి మాట్లాడుతూ పోటీల్లో గెలుపోటములు సహజమేనని అన్నారు. మైదుకూరులో వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చూపి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవాలని సూచించారు. శెట్టిపల్లె నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్‌తోపాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కార్యనిర్వాహక కార్యదర్శులు అరుణకుమారి, వసంత, మేధా డిఫెన్స్ అకాడమి చైర్మన్ సి.నరసింహులు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర నాయకులు విజేతలుగా నిలిచిన జట్లలోని క్రీడాకారులకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాల సంఘం నాయకులు సాజిద్, రమేష్ యాదవ్, నిత్య ప్రభాకర్, ప్రవీణ్ కుమార్, కిరణ్, శ్రీకాంత్, రమేష్ బాబు, గణేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


కడప జట్టుకు రూ.20 వేల నగదు అందిస్తున్న శెట్టిపల్లె నాగిరెడ్డి


బాలుర విభాగంలో విజయం సాధించిన విజయనగరం జట్టు

రాష్ట్ర జట్లకు ఎంపిక

మైదుకూరు : శ్రీనగర్‌లో వచ్చే నెలలో జరిగే జాతీయ స్థాయి అండర్–17 బాలుర, బాలికల వాలీబాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్లను ఎంపిక చేశారు. అండర్–17 బాలుర, బాలికల వాలీబాల్ టోర్నమెంట్ ముగిసిన అనంతరం రాష్ట్ర బాలుర, బాలికల జట్లను ఎంపిక చేశారు.

బాలికల జట్టు : జి.ప్రవల్లిక (విశాఖపట్నం), ఎం.విజయలక్ష్మి (విజయనగరం), వి.కుసుమప్రియ, పావని (కడప), సోని, ఎం.సుమశ్రీ(గుంటూరు), పి.జశ్విత(అనంతపురం), ఇ.షణ్ముఖ ప్రియ (చిత్తూరు), కె.ప్రీతి (తూర్పుగోదావరి), ఎస్.పూజిత (ప్రకాశం), సీహెచ్ శ్రీపద్మజ(కృష్ణ), స్టాండ్ బైగా డి.కీర్తన (గుంటూరు), ఎస్.మానస (అనంతపురం), ఎం.వెంకటలక్ష్మి (నెల్లూరు), ఎస్.ఉన్నత సత్యశ్రీ(కృష్ణ), డి.సమైక్య (ప్రకాశం).

బాలుర జట్టు : ఎ.ప్రేమ్ కుమార్, ఎస్.తోషన్ రాము (శ్రీకాకుళం), టి.రాహుల్, ఎస్.మౌర్య (విశాఖపట్నం), బి.రంజిత్ (విజయనగరం), వి.రాజు (పశ్చిమ గోదావరి), టి.సుధీర్ (అనంతపురం), కె.డేవిడ్ రాజు (గుంటూరు), పి.కిరణ్‌బాబు (ప్రకాశం), ఎస్.అజయ్‌కుమార్ (కడప), స్టాండ్‌బైగా ఎస్.భరత్ (కృష్ణ), వై.రోహిత్(కడప), ఎం.ఆర్యన్ (నెల్లూరు), బి.కార్తీక్(అనంతపురం), వై.రాంబాబు (తూర్పుగోదావరి), కె.రాము (పశ్చిమ గోదావరి).


జాతీయ పోటీలకు ఎంపికైన బాలుర జట్టు


రాష్ట్ర వాలీబాల్ బాలికల జట్టు

ఇస్రో శిక్షణతో ఎంతో ఉపయోగం


ఇస్రో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు, పరిశోధకులతో వీసీ, ప్రిన్సిపాల్

వైవీయూ : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అందించే శిక్షణ పీజీ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. ఇస్రో ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 14 విశ్వవిద్యాలయాలను ఎంపిక చేసి అందులో పీజీ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులకు 'స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ అవేర్‌నెస్ ట్రెయినింగ్ ఆన్‌లైన్ ద్వారా 18 రోజుల పాటు నిర్వహించింది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న 32 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం వైవీయూలోని సీవీ రామన్ సైన్స్‌బ్లాక్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్రో వైవీయూ నోడల్ అధికారి, భౌతికశాస్త్ర విభాగాధిపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, భౌతికశాస్త్ర అధ్యాపకులు వెంకటరాము, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో పీజీ ప్రవేశాలు షురూ

యోగివేమన విశ్వవిద్యాలయంలో పీజీ ప్రవేశాల ప్రక్రియ సోమవారం కొనసాగింది. ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య మాట్లాడుతూ 10వ తేదీ వరకు ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్‌అడ్మిషన్స్ అసోసియేట్ డైరెక్టర్లు లక్ష్మీప్రసాద్, శ్రీధర్‌బాబు, శ్రీధర్‌రెడ్డి, ఆచార్య కాత్యాయని, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, వి.సునీత, శ్రీనివాసగౌడ్, గణేష్ నాయక్, డీఓఏ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు, అనంత జట్ల జయకేతనం


కేఓఆర్ఎం మైదానంలో పోటీపడుతున్న చిత్తూరు, కర్నూలు జట్లు

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు జయకేతనం ఎగురవేశాయి. కడప నగరంలోని కేఓఆర్ఎం మైదానంలో 41 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 11.5 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 72 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని శశాంక్ శ్రీవాత్సవ్ 29 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ సాత్విక్ 2 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 54.4 ఓవర్లలో 220 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సాయిసూర్యతేజారెడ్డి 140 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు ఆశిష్‌రెడ్డి 4, మల్లేశన్ 3 వికెట్లు తీశారు. కాగా చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 550 పరుగులు చేయగా, కర్నూలు జట్టు 226 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో చిత్తూరు జట్టు 176 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

'అనంత' విజయం

కేఎస్ఆర్ఎం మైదానంలో 282 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు 64.3 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 318 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని దత్తారెడ్డి 87 పరుగులు చేశాడు. కడప బౌలర్లు అస్లాం 3, విజయ భువనేంద్ర 2, ఆదిల్ హుస్సేన్ 2, సాయికుమార్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 38.4 ఓవర్లలో 172 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని శివకేశవరాయల్ 24 పరుగులు చేశాడు. అనంతపురం బౌలర్లు లోహిత్‌సాయికిశోర్ 6 వికెట్లు, మల్లికార్జున 3 వికెట్లు తీశారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో అనంత జట్టు 207 పరుగులు చేయగా, కడప 171 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో అనంతపురం జట్టు 182 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.


సాయిసూర్యతేజారెడ్డి, కర్నూలు, (140 పరుగులు)


దత్తారెడ్డి, అనంతపురం, (87 పరుగులు)


లోహిత్ సాయికిశోర్, అనంతపురం, (6 వికెట్లు)

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ముగ్గురికి తీవ్ర గాయాలు


మధుసూదన్‌రెడ్డి (ఫైల్)


మృతి చెందిన మధుసూదన్‌రెడ్డి

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండల పరిధిలోని తోల్లగంగనపల్లె సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వల్లూరు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రగుంట్లకు చెందిన రాజుల మధుసూదన్‌రెడ్డి (28) కడపలోని రైల్వే విద్యుత్ కేంద్రంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తుండే వాడు. ఆయన విధులు ముగించుకుని సోమవారం ఉదయం ఎర్రగుంట్లకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. మార్గంమధ్యలో తోల్లగంగనపల్లె బస్టాపు వద్ద గంగాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు లక్ష్మీనరసింహ, మధు పాఠశాలకు వెళ్లడానికి లిఫ్ట్ అడిగారు. దీంతో వారిని ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని బయలుదేరాడు. అక్కడి నుంచి కొద్ది దూరంలో ఏ ఓబాయపల్లెకు చెందిన నిరంజన్‌రెడ్డి వస్తున్న ద్విచక్ర వాహనం, మధుసూధన్‌రెడ్డి ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. వారి వెనుకే కడప వైపు నుంచి ఎర్రగుంట్ల వైపు వస్తున్న లారీ ద్విచక్ర వాహనాలను ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు చెల్లాచెదురుగా పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు చికిత్స కోసం కడప ఆసుపత్రికి తరలించారు. కాగా తీవ్రంగా గాయపడ్డ మధుసూదన్ రెడ్డిని ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్య కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. కాగా ఆయనకు ఈ నెల 25వ తేదీన వివాహం జరగాల్సి వుందని సమాచారం.

కృష్ణా జలాలతో బీజేపీ రాజకీయాలు

కలెక్టరేట్ వద్ద అఖిలపక్షం ఆందోళన

కడప సెవెన్ రోడ్స్ : కృష్ణా నది జాలాలపై ఏర్పాటైన ట్రిబ్యునల్స్ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కు కేటాయించిన నీటిని ఏపీ, తెలంగాణల మధ్య పునఃపంపిణీ చేయాలంటూ.. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు అదనపు బాధ్యతలను కట్టబెట్టడం ద్వారా తెలంగాణలో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న బీజేపీ కుట్ర రాజకీయాలను తిప్పి కొట్టాలని అఖిలపక్ష నాయకులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఆందోళనలో టీడీపీ రాష్ట్ర నాయకుడు జి.లక్ష్మీరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్ రెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు డబ్ల్యూ రాము మాట్లాడుతూ బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలు నికర జలాలు కేటాయించడమే కాకుండా మిగులు జలాలను వాడుకునే వెసులుబాటు కల్పించిందని పేర్కొన్నారు. బచావత్ కేటాయింపులు యథావిధిగా అమలు చేస్తూనే మిగులు జలాలను కూడా 448 టీఎంసీలుగా లెక్క కట్టి మూడు రాష్ట్రాల మధ్య బ్రిజేష్ ట్రిబ్యునల్ పంపిణీ చేసిందన్నారు. దీనిపై ఆంధ్ర రాష్ట్రం సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిందని తెలిపారు. ఒక వైపు కేసు విచారణలో ఉండగానే.. బీజేపీ ఇప్పుడు బ్రిజేష్ ట్రిబ్యునల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించడం ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే అని విమర్శించారు. ఇటీవల కర్ణాటక ఎన్నికల దృష్ట్యా ఎగువ భద్రకు జాతీయ హోదా కల్పించి లబ్ధి పొందాలని చూసిందన్నారు. ఇప్పుడు తెలంగాణలో లబ్ధి పొందేందుకు కృష్ణా జలాల పేరుతో కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు రమణయ్య, గుర్రప్ప, నరసింహులు, దస్తగిరిరెడ్డి, కెసీ బాదుల్లా, నాగ సుబ్బారెడ్డి, వెంకటశివ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన


బీపీ పరీక్ష చేయించుకుంటున్న నోడల్ అధికారి మురళీధర్‌రెడ్డి

వేముల : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని జిల్లా నోడల్ అధికారి మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వి.కొత్తపల్లె గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష పనితీరుపై తెలుసుకునేందుకు ప్రభుత్వం అన్ని జిల్లాలకు నోడల్ అధికారులను నియమించిందన్నారు. వైద్యశిబిరానికి వచ్చిన రోగులను అడిగి.. అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన బీపీ చెకప్ చేయించుకున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ స్టాల్స్‌ను పరిశీలించి అక్కడి గర్భవతులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఓ అర్జున్ రావు, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షురాలు లీలావతి, సర్పంచ్ గంగరాజు, వైద్యులు పాల్గొన్నారు.

పదోన్నతిపై అభ్యంతరం

కడప రూరల్ : వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని ఓ ఉద్యోగి పదోన్నతిపై కొందరు అభ్యంతరం లేవనెత్తారు. కడపలోని పాత రిమ్స్‌లో ఉన్న ఈ కార్యాలయం వేదికగా.. శనివారం రాయలసీమ జిల్లాల్లోని మొత్తం 13 మందికి సీనియర్ అసిస్టెంట్ నుంచి ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పించారు. అందులో ఒకరు చెవుడు, మూగ కింద పదోన్నతి జాబితాలో ఉన్నారు. దీనిపై ఏపీ హియరింగ్ హ్యాండీక్యాప్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌ను అడ్డుకున్నారు. దీంతో రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్ ఆ పదోన్నతిని నిలుపుదల చేశారు. ఆ ఉద్యోగి చెవుడు, మూగ శాతం నిర్ధారణ కోసం విశాఖపట్నం ఈఎన్‌టీ బోర్డ్‌కు రెఫర్ చేశారు.

ఏపీ పీజేఈయూ అధ్యక్షుడి ఎన్నిక


రామక్రిష్ణారెడ్డి

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ)కి చెందిన వి.రామక్రిష్ణారెడ్డిని ఏపీ పవర్ జనరేటింగ్ ఎంప్లాయిస్ యూనియన్ – 1535 (ఏపీ పీజేఈయూ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. 1535 యూనియన్ జనరల్‌బాడీ సమావేశం ఆర్టీపీపీలోని యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఆ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎంఏ వజీర్, జనరల్ సెక్రటరీ శ్రీనివాసకుమార్ చేతుల మీదుగా రామక్రిష్ణరెడ్డి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. అనంతరం ఆర్టీపీపీ సీఈ నాగరాజును కలిసి పలు సమస్యలపై విన్నవించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలు

- విజేతలుగా కడప, అనంతపురం జట్లు
- జాతీయ స్థాయి జట్టుకు క్రీడాకారుల ఎంపిక


అండర్–19 పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కడప బాలికల జట్టు

మదనపల్లె : స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో మూడు రోజులుగా నిర్వహించిన 67వ ఎస్‌జీఎఫ్ అంతర్‌జిల్లాల ఫుట్‌బాల్(అండర్–19) పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపాదికన జట్లు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో మొదటి స్థానంలో కడప, రెండో స్థానంలో అనంతపురం, మూడో స్థానంలో గుంటూరు, నాలుగో స్థానంలో విశాఖపట్నం నిలిచాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో 2–1 స్కోర్‌తో అనంతపురంపై కడప జట్టు జయకేతనం ఎగురవేసింది. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో అనంతపురం, ద్వితీయస్థానంలో గుంటూరు, మూడోస్థానంలో కడప, నాలుగోస్థానంలో చిత్తూరు నిలిచాయి. ఫైనల్స్‌లో 4–3 స్కోర్‌తో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు మదనపల్లె ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, ఎస్‌జీఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా సెక్రటరీ జయరామయ్య చేతుల మీదుగా కప్‌లు, మెడల్స్, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వరదారెడి గారి నారదరెడ్డి ఫుట్‌బాల్ పోటీల నిర్వహణకు రూ.10,116, విజేతలుగా నిలిచిన కడప(బాలికలు), అనంతపురం(బాలురు) జట్లుకు ఒక్కొక్క జట్టుకు రూ.10,116 చొప్పున మొత్తం రూ.30,348 ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పాటైన తర్వాత మదనపల్లెలో తొలిసారిగా 67వ ఎస్‌జీఎఫ్ అంతర జిల్లాల ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్‌జీఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా సెక్రటరీ జయరామయ్య మాట్లాడుతూ 67వ అంతరజిల్లాల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక చేశామన్నారు. వీరు రాష్ట్రం తరపున జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకరరెడ్డి, రాజగోపాల్, ఏసీటీఓ నాగేంద్ర, హెచ్ఎం సుబ్బారెడ్డి, మహమ్మద్‌ఖాన్, పీఈటీలు అన్సర్, సుధాకర్, రమేష్, నాగరాజు, కరుణానిధి, 13 జిల్లాల జట్ల మేనేజర్‌లు, కోచ్‌లు పాల్గొన్నారు.

అండర్–19 జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక

ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా సెక్రటరీ జయరామయ్య తెలిపారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా ఉదయ్‌భాస్కర్, శ్రీనివాసులు, రమేష్ వ్యవహరించారు. జాతీయ స్థాయి జట్టుకు ఎంపికైన బాలురు ఈ నెల 30వ తేదీ నుంచి నవంబర్ 4 వరకు జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో, బాలికలు నవంబర్‌లో పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

బాలికల జట్టు

ఎస్.భానుశ్రీ, కె.మనీషా, ఆర్.భువన, ఎం.సావిత్రి(కడప), పి.కావ్యశ్రీ, యు.హారిక, కె.మమత(అనంతపురం), ఎం.పవిత్రపావని, ఎం.జ్యోతి, పి.టి.వి.హరిప్రియ(గుంటూరు), పి.సులోచన, జి.హేమహాసిని(వైజాగ్), పి.సుహర్ష, ఏ.బెహ్లాపమన్ జున్నా(కృష్ణా), కె.పావని(చిత్తూరు), జి.కావేరి(ప్రకాశం), ఎం.శిరీషా(నెల్లూరు), వి.సత్యసౌమ్య(ఈస్ట్‌గోదావరి) రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. స్టాండ్‌బైలుగా కె.జొన్నాప్రహర్షిత(కృష్ణ), ఎం.వెంకటసుప్రజ (కడప), ఎల్.గాయత్రి(విజయనగరం), వి.ప్రజ్ఞారమణ(కర్నూలు), జీవిత(నెల్లూరు).

బాలుర జట్టు: ఆసిఫ్, ఎ.నందకిశోర్, భరత్, జి.నరేంద్ర(అనంతపురం), జి.కౌషిక్, ఎస్.డి.రవూఫ్, ఎస్.కె.నాగషరీఫ్(గుంటూరు), సీతుమాధవ్, పి.విఘ్నేష్(కడప), సుఫియాన్, సి.అరవింద్(చిత్తూరు), జె.మైఖేల్(ప్రకాశం), అభి(కర్నూలు), వైడియస్ అశ్వథ్(వైజాగ్), జే.రాముడు(కృష్ణ), కెల్విన్‌జెన్నెట్(చిత్తూరు), వై.కల్యాణ్(విజయవాడ), కె.అశోక్‌కుమార్(నెల్లూరు) స్టాండ్‌బైలుగా అఖిల్ యాదవ్(చిత్తూరు), వి.విజయ్(గుంటూరు), డి.వీరబాబు(ఈస్ట్‌గోదావరి), టి.రోహిత్.శ్రీ.ఫణిధర్(వెస్ట్ గోదావరి), జ్ఞానేశ్వర్(శ్రీకాకుళం).